సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 246 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.5.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/23.6°

జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

రీల్ చేయండి రూ.లక్ష గెలుచుకోండి

- ఔత్సాహికులకు కలెక్టర్ బంపర్ ఆఫర్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: సామాజిక మాధ్యమాల్లో ఉత్సాహంగా ఉండే యువతకు కలెక్టర్ టీఎస్ చేతన్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. సినిమా మాటలు, డైలాగ్‌లతో రీల్స్ చేసే వారు... జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే రీల్స్ చేస్తే నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. ఆకర్షణీయమైన రీల్స్, వీడియోలు రూపొందించిన వారిలో ముగ్గురిని ఎంపిక చేస్తామని, మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేల చొప్పున అందిస్తామన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ప్రదేశాలు, వారసత్వం, సంస్కృతిపై త్వరలో నిర్వహించనున్న థీంకు సంబంధించి పర్యాటక శాఖ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. వీడియోలు, రీల్స్‌ను పోస్టర్‌పై ఇచ్చిన క్యూర్ కోడ్ ద్వారా సెప్టెంబర్ 5వ తేదీలోపు పంపాలన్నారు. విజేతలకు ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27వ తేదీన ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పర్యాటక శాఖ సిబ్బంది ప్రతాప్‌రెడ్డి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు గిరిజన అభ్యర్థులకు జాబ్‌మేళా

పుట్టపర్తి అర్బన్: పది/ఇంటర్/డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు ఈనెల 21న కదిరి ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏపీ గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఇంగ్లిష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లోని అమెజాన్ స్టోర్స్‌లో ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారానికి ఐదు రోజులు పగలు, రాత్రి షిఫ్టులు ఉంటాయన్నారు. వేతనం రూ.17 వేలు ఉంటుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐతో పాటు అదనపు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 7981333346, 7993864764 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పుట్టపర్తిలో అమెరికా వాసి మృతి



మృతి చెందిన యాస్‌నాథ్

పుట్టపర్తి టౌన్: అమెరికాకు చెందిన యాస్‌నాథ్ (78) అనారోగ్యంతో సోమవారం పుట్టపర్తిలో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... అమెరికా వాసి యాస్‌నాథ్ సత్య సాయి బాబా భక్తుడు. 2016లో పుట్టపర్తి వచ్చిన ఆయన ఇక్కడే స్థిరపడ్డాడు. మున్సిపాలిటీ పరిధిలో ప్రశాంతి గ్రామంలో సాయి రెస్మా లాడ్జి వెనుకభాగంలోని ఓ ఇంట్లో నివాసం ఉంటూ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. ఈ క్రమంలో వయసు మీద పడి అనారోగ్యానికి గురైన ఆయన సోమవారం మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంలో సీఐ సునీత యాస్‌నాథ్ ఉంటున్న ఇంటికి చేరుకొని పరిశీలించారు. అతను రెండు రోజుల క్రితమే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని వద్ద ఉన్న వీసా కార్డు ఆధారంగా చిరునామా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

ప్రాణాలు తీస్తున్న అతిసారం

వర్షాకాలం... వ్యాధులు ప్రబలే కాలం. ఏ ప్రభుత్వమైనా చాలా అప్రమత్తంగా ఉంటుంది. గ్రామాల్లో పారిశుధ్య చర్యలతో పాటు నీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతుంది. కానీ రాష్ట్రంలోని కూటమి సర్కార్... ప్రజారోగ్యాన్ని పూర్తిగా విస్మరించింది. రాజకీయాలతో కాలం వెళ్లదీస్తోంది. ఫలితంగా ప్రాణాధారమైన నీరు కలుషితమై జనం అతిసారం బారిన పడుతున్నారు. గుడిబండ మండలం కొంకల్లులో 10 రోజుల వ్యవధిలో ఏడుగురు మృత్యువాత పడ్డారు. రొళ్ల మండలం ఎం.రాయాపురంలోనూ ఒకరు మృతి చెందగా, 25 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నా కనీస చర్యలు లేకపోవడంపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు.

- కొంకల్లులో మృత్యు ఘంటికలు
- 10 రోజుల్లో ఏడుగురు మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- ఏడుగురి మృతి తర్వాత గ్రామంలో వైద్య శిబిరం
- ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న జనం
- రొళ్ల మండలం ఎం.రాయాపురంలో ఒకరు మృతి..25 మందికిపైగా అస్వస్థత





వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొంకల్లుకు సరఫరా అవుతున్న నీరు

మడకశిర/గుడిబండ: గుడిబండ మండలంలోని కొంకల్లు గ్రామాన్ని అతిసారం పీడిస్తోంది. 10 రోజుల్లోనే ఏడుగురిని పొట్టనబెట్టుకుంది. 2 వేల మంది జనాభా ఉన్న గ్రామంలో తాగునీరు కలుషితం కాగా.. అతిసారం ప్రబలింది. పది రోజుల వ్యవధిలోనే ఏడుగురు మృతి చెందినా వైద్య,ఆరోగ్యశాఖ గుర్తించకపోవడం గమనార్హం. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏడుగురు బలైపోయారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది గ్రామస్తులు కడుపునొప్పి, విరేచనాలు, వాంతులతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు.

10 రోజుల్లో ఏడుగురు మృతి?

అతిసారం ప్రబలడం.. అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో కొంకల్లులో 10 రోజుల వ్యవధిలోనే ఏడుగురు మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. 10 రోజుల క్రితం తిమ్మక్క(50) వాంతులు, విరేచనాలతో మృతి చెందింది. ఆ తర్వాత మృతురాలి తల్లి లక్ష్మమ్మ(70) కూడా మృతి చెందింది. ఆ తర్వాత గ్రామానికి చెందిన సన్నమ్మ(80), యశోదమ్మ(60), బుడ్డ ఓబన్న(85), మల్లికార్జున(50) వరుసగా మృతి చెందారు. తాజాగా సోమవారం మరో మహిళ మృతి చెందారు. మృతురాలు తన కూతురును చూసేందుకు కొంకల్లుకు వచ్చి అతిసారంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. అయినా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ గ్రామంలో అతిసారం కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మరి కొందరు అతిసారంతో బాధపడుతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు..

అతిసారంతో కొంకల్లులో రోజుకొకరు మృత్యువాత పడుతున్నా వైద్య,ఆరోగ్య శాఖ కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో కర్ణాటక సరిహద్దులోని కొంకల్లు వాసులంతా వాంతులు, విరేచనాలతో చికిత్స కోసం బెంగళూరు, శిర, తుమకూరు, పావగడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరారు.

ఆలస్యంగా మేల్కొన్న వైద్య, ఆరోగ్యశాఖ..

10 రోజుల నుంచి కొంకల్లులో అతిసారం కేసులు నమోదవుతున్నా... ఆ సమాచారం తమకు తెలియదని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. ఏడుగురు మృతి చెందిన తర్వాత సోమవారం గ్రామంలో గుండుమల పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ముగ్గురికి జ్వరం రావడంతో వారి రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. జిల్లా స్థాయి అధికారులు కూడా ఇంత వరకు గ్రామాన్ని సందర్శించ లేదు. పరిస్థితిపై సమీక్షించలేదు. అసలు ప్రభుత్వం ఉందా..? లేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కలుషిత నీరే కారణమా?

తాగునీరు కలుషితం కావడం వల్లే అతిసారం ప్రబలినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. స్కీం బోరు నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుండగా.. పైప్‌లైన్ పలుచోట్ల దెబ్బతిన్నట్లు సమాచారం. దీంతో మురుగునీరు పైప్‌లైన్‌లో చేరి తాగునీరు కలుషితమైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలా కలుషితమైన నీటిని తాగడం వల్లే జనం అతిసారం బారిన పడినట్లు తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతోనే అతిసారం ప్రబలి మరణాలకు దారితీసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కొంకల్లులో భయం...భయం..

కొంకల్లులో ఇంట్లో ఒకరైనా కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. అసలు ఏం జరుగుతోందో తెలియక జనం భయంగా గడుపుతున్నారు. అతిసారం బారిన పడిన వారిలో రోజుకొకరు చనిపోతుండగా... మిగతా బాధితులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో ఇంత పెద్ద స్థాయిలో ప్రాణనష్టం జరిగినా... ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో స్పందించ లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఇంత వరకు గ్రామానికి వచ్చి విచారించిన పాపాన పోలేదు. ఇప్పటికే చాలా మంది గ్రామాన్ని వదిలి బంధువుల ఇళ్లకు వెళ్లి పోయారు. మరికొంత మంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు.

ఎం.రాయాపురంలో ఒకరు మృతి



ఎం.రాయాపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- 25 మందికిపైగా అస్వస్థత

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం గ్రామంలోనూ అతిసారం ప్రబలింది. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన రత్నప్ప (63) విరేచనాలతో బాధపడుతూ చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 40 మందికిపైగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు వారు వెల్లడించారు. శ్రీరామరెడ్డి రక్షిత తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగునీరు కలుషితమై అతిసారం వ్యాపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన వెంకటేష్, రాజన్న, కరియన్న, లక్ష్మమ్మ, రత్నమ్మ, బాలకృష్ణ, అంజినప్ప, సిద్ధమ్మ, సన్నమ్మ, జగన్న, సుదమ్మతో పాటు హనుమంతరాయప్ప, నవీన్, పార్వతమ్మ, నాగమ్మ తదితరులు రొళ్ల, మడకశిర ప్రభుత్వ ఆస్పత్రితో పాటు కర్ణాటక ప్రాంతం శిర, బెంగళూరు, తుమకూరు తదితర చోట్ల ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైద్యాధికారులు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన వారిని గుర్తించి నమూనాలను సేకరించారు. తర్వాత గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.


అవి అతిసారం మరణాలు కావు

కొంకల్లులో జరిగినవి అతిసారం మరణాలు కావు. గ్రామంలో ఏడుగురు మృతి చెందిన మాట వాస్తవమే. అయితే వారు అతిసారంతో మృతి చెందలేదు. నేను మృతుల వివరాలను తెప్పించుకుని చూశాను. వారు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతి చెందారు. ప్రస్తుతం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. పూర్తి స్థాయిలో గ్రామంలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రాణ నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

–మంజువాణి, డీఎంహెచ్‌ఓ

ఈద్గాను కూల్చి స్థలం ఆక్రమించారు

- టీడీపీ నాయకుడిపై కలెక్టర్‌కు ముస్లింల ఫిర్యాదు
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 122 అర్జీలు



ఈద్గా కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పుట్టపర్తి మండలం పెదపల్లి ముస్లింలు



తమను ఆదుకోవాలని కలెక్టరేట్ కు విచ్చేసిన వృద్ధ దంపతులు గంగయ్య, నరసమ్మ

పుట్టపర్తి అర్బన్: ''ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు పెదపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 139లోని 56 సెంట్ల భూమిని పంచాయతీ తీర్మానం మేరకు మాకు అప్పగించారు. ఆ స్థలంలో మేము ఈద్గా కట్టుకుని 45 ఏళ్లుగా నమాజు చేసుకుంటున్నాం. ఆ స్థలం ముందు ఎన్‌హెచ్–342 వెళ్తుండగా... విలువ భారీగా పెరిగింది. దీంతో పుట్టపర్తి మండలం పెడపల్లికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీరాంనాయక్ ఆ స్థలంపై కన్నేశారు. ఇటీవల ఈద్గాను కూల్చి వేసి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. మీరే మాకు న్యాయం చేయాలి'' అని పెడపల్లికి చెందిన పలువురు ముస్లింలు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అర్జీ సమర్పించారు. కార్యక్రమానికి వివిధ సమస్యలపై మొత్తంగా 122 అర్జీలు అందగా, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఫీసర్ శివారెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారం కోసం అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్య పరిశీలించాలన్నారు. అప్పుడే శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రతి అర్జీకి గడువులోపు పరిష్కారం చూపాలని, లేకపోతే అందుకు గల కారణాన్ని అర్జీదారునికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో మరికొన్ని..

- తమ కుమారుడు నూర్‌మహమ్మద్‌కు పుట్టుకతోనే వంద శాతం వైకల్యం ఉందని, అయినా ప్రభుత్వం రూ.6 వేలు పింఛనే ఇస్తోందని కదిరి పట్టణానికి చెందిన అన్సర్‌జాన్, హారున్ దంపతులు కలెక్టర్‌కు తెలిపారు. 26 ఏళ్ల వయస్సు వచ్చినా మంచానికి పరిమితమైన తమ కుమారుడి మందులకు కూడా పింఛన్ డబ్బు చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ పెంచి ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ చేతన్‌కు అర్జీ ఇచ్చారు.
- సచివాలయం ఏఎన్ఎంలుగా పని చేస్తున్న తమను వైద్య ఆరోగ్యశాఖలోకి విలీనం చేయాలని సచివాలయ ఏఎన్ఎంలు కలెక్టర్‌కు విన్నవించారు. ప్రస్తుతం ప్రభుత్వం బదిలీల ప్రక్రియ ప్రారంభించిందని, తమకూ బదిలీ సౌకర్యం కల్పించి ఆస్పత్రులకు పంపాలని కోరారు. ఆ మేరకు వినతి పత్రం అందజేశారు.
- తమకు ముగ్గురు కుమారులున్నా ఏ ఒక్కరూ ఆదరించడం లేదని ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన వృద్ధ దంపతులు గంగన్న, నరసమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కోసం ఆర్డీటీ సంస్థ నిర్మించి ఇచ్చిన ఇంటిని కూడా కుమారులే స్వాధీనం చేసుకున్నారన్నారు. జీవితంపై విరక్తి కలుగుతోందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కలెక్టర్ చేతన్‌కు అర్జీ ఇచ్చారు. తమను ఆదుకోవాలని, కూడు, గూడు ఏర్పాటు చేయించాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

- పారిశ్రామిక అభివృద్ధికి నూతన పాలసీ
- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏపీలో నూతన పారిశ్రామిక పాలసీ అమలు చేయనున్న నేపథ్యంలో 'ఐడీపీ 2024–29' పాలసీకి సంబంధించిన అంశాలు తెలిపారు. అలాగే పారిశ్రామిక యాజమాన్యాల నుంచి సూచనలు కోరారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, నిబంధనలు క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించే దిశగా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తామన్నారు. ఇందులో ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులకు ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రణాళిక ఉంటుందన్నారు. జిల్లాలోని పారిశ్రామిక సంఘాలు, ఛాంబర్ అసోసియేషన్లు, భారీ, మెగా పరిశ్రమల యాజమాన్యాలను సంప్రదిస్తున్నామన్నారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాల సమన్వయం చేసుకుని వారి సూచనలలో ఒక నివేదికను సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, జౌళి, చేనేత శాఖ జిల్లా అధికారి రమేష్, ఎల్‌డీఎం రమణకుమార్, ఏపీఎస్ఎఫ్‌సీ మేనేజర్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

'తమ్ముళ్ల' మట్టి దందా

- పెన్నా గట్లను తవ్వేస్తున్న వైనం
- అడ్డుకున్న సింగిరెడ్డిపల్లి వాసులు
- ఎమ్మెల్యే బాలకృష్ణ అనుమతి ఇచ్చారని తెలిపిన నాయకులు



పెన్నానది పరిసరాల్లో జేసీబీతో మట్టి తవ్వుతున్న దృశ్యం



మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

హిందూపురం: అక్రమ సంపాదనకు అలవాటు పడిన తెలుగు తమ్ముళ్లు సహజ వనరులనూ కొల్లగొడుతున్నారు. చివరకు నది గట్లనూ సరి కేస్తూ మట్టిని తరలించుకుంటూ మనీ సంపాదిస్తున్నారు. హిందూపురం సమీపంలోని పెన్నానది గట్లను జేసీబీలతో తవ్వేస్తూ మట్టిని తరలిస్తుండగా...ఆ ప్రాంతమంతా పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. టీడీపీ నేతల మట్టి దందాతో పెన్నా ప్రవాహానికి అడ్డూఅదుపు లేకుండా పోతుందని, దీంతో నీరు పొలాలను ముంచెత్తుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సింగిరెడ్డిపల్లి వాసులు సోమవారం మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అసలు మీకు అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించగా.. ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయం ఇచ్చిందంటూ తెలుగు తమ్ముళ్లు సమాధానం ఇచ్చారు. నిబంధనల ప్రకారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటిది సదరు అధికారులతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే కార్యాలయం ఎలా అనుమతి ఇచ్చిందని సింగిరెడ్డిపల్లి వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి మండల రెవెన్యూ అధికారులను పిలిపించి మట్టి తవ్వకాలపై ప్రశ్నించారు. ఇది జరుగుతుండగానే...సచివాలయ సిబ్బంది అక్కడికి వచ్చి ఎమ్మెల్యే ఆఫీసునుంచి అనుమతి ఇచ్చారని చెప్పడంతో పరిగి రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మట్టి మాఫీయా యథావిధిగా తవ్వకాలు జరుపుతూ మట్టిని తరలిస్తోంది.

రాఖీకట్టి.. రక్ష పలికి



అడిషనల్ ఎస్పీ విష్ణుకు రాఖీ కడుతున్న ఎస్పీ రత్న



చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్‌కు రాఖీ కడుతున్న మహిళా పోలీసులు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆశీర్వాదాలు పొందారు. పలువురు ప్రముఖులకు బ్రహ్మకుమారీలు రక్షాబంధనం కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఏపీఆర్‌జేసీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జలజ, పీడీ శ్రీనివాసరెడ్డి తదితరులు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హిందూపురంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో పోటీలకు ఏపీఆర్‌జేసీ విద్యార్థులు 9 మంది హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చాటిన ఏడుగురు అక్టోబర్‌లో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన సలీంబాషా, చేతన్‌గౌడ్, రఘు, ఇంతియాజ్, వినయ్‌కుమార్, విజయ్‌కుమార్, రామ్‌చరణ్, యుగంధర్‌ను ప్రిన్సిపాల్ జలజ, పీడీ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- సెప్టెంబర్ 7న వినాయక చవితి
- ఈ ఏడాది మట్టి గణపయ్యలకే ప్రాధాన్యతనిస్తున్న ఉత్సవ కమిటీలు


గణనాథుడికి రంగులు అద్దుతున్న దృశ్యం


హిందూపురంలో మంటపం వద్దనే మట్టితో తయారు చేస్తున్న గణపతి విగ్రహం

హిందూపురం అర్బన్: ఆది పూజల దేవుడు, విఘ్నాధిపతి వినాయకుని ఉత్సవాలకు జిల్లా సిద్ధమవుతోంది. వచ్చే నెల 7న వినాయకచవితిని ఘనంగా నిర్వహించేందుకు పల్లెలు, పట్టణాల్లో ఉత్సవ కమిటీలు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. చాలా చోట్ల పర్యావరణానికి హాని కలగని మట్టి గణపయ్యల ఏర్పాటుకే ప్రాధాన్యతనిస్తుండడం గమనార్హం. ఇప్పటికే హిందూపురం, కదిరి, ధర్మవరం పట్టణాల్లో ఎక్కువగా మంటపాల వద్దే భారీ పరిమాణంలో వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేయిస్తున్నారు. పలుచోట్ల కోల్‌కత్తా , రాజస్తాన్ నుంచి వచ్చిన కళాకారులు వినూత్న ఆకృతులతో గణనాథుడి విగ్రహాలను సిద్ధం చేసి, ఉత్సవ కమిటీల నిర్వాహకులను ఆకర్షిస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1,500 మంటపాలు..

హిందూపురంతో పాటు కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలు కలుపుకుని ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా 1,500 మంటపాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఒక్క హిందూపురంలోనే 150 మంటపాలు అధికారికంగా ఏర్పాటు చేస్తుండగా అన ధికారికంగా మరో 50 వరకూ ఉంటాయని అంటున్నారు. కదిరిలో 100కుపైగా, ధర్మవరంలో 100కుపైగా, మడకశిర, పెనుకొండలో 50కి పైగా, మండల కేంద్రాల్లో 3 నుంచి 8 వరకు, గ్రామాల్లో ఒకట్రెండు మంటపాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా మంటపాల నిర్వాహకులు ఇప్పటికే తయారీదారులకు అడ్వాన్సులు సైతం చెల్లించి విగ్రహాల తయారీ చేయిస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.1లక్ష వరకూ విలువైన విగ్రహాలను సిద్ధం చేస్తుండగా... వీటిలో సగటున రూ.25వేల నుంచి రూ.35వేల వరకు ధర ఉన్న విగ్రహాలకు ఎక్కువగా అడ్వాన్సులు ఇచ్చి బుక్ చేసుకుంటున్నట్లు సమాచారం.

శాంతి కమిటీ సమావేశాలతో అధికారులు బిజీ..

జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా పోలీసులు శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సవ కమిటీ సభ్యులకు పలు నిబంధనలు వివరిస్తున్నారు. వినాయక మంటపాలు ఏర్పాటు చేసేవారు ఐదు లేదా అంత కంటే ఎక్కువ మంది ఓ కమిటీగా ఏర్పడి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏదైనా గుర్తింపు కార్డు చూపించి అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రైవేట్, పంచాయతీ, మున్సిపాలిటీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయదలుచుకుంటే ముందుగా అనుమతులు తీసుకోవాలి. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నిబంధనలకు అనుగుణంగా మంటపాల వద్ద ఇసుక, నీళ్లు సిద్ధంగా ఉంచాలి. ప్రతిష్ఠించే విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజులు, నిమజ్జనం చేసే తేదీ, ఆయా పట్టణాల్లో నిర్దేశించే మార్గం, నిమజ్జన ప్రదేశం, వినియోగించే వాహనాల వివరాలు విధిగా పోలీస్ స్టేషన్‌లో తెలపాలి. లౌడ్ స్పీకర్లు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్న నిబంధనలు ఉన్నాయి.

10 నెలలుగా ఇక్కడే



పండుగ ముగిసిన తర్వాత రెండు నెలల పాటు మా ఊరికి వెళ్లి వస్తుంటాం. 10 నెలలుగా హిందూపురంలోని చౌడేశ్వరి కాలనీలో ఉంటూ వినాయకుడి ప్రతిమలు చేస్తున్నాం. నా వద్ద ప్రస్తుతం 200 విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఆకృతి, ఎత్తును బట్టి రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకూ విక్రయిస్తుంటా. ఇప్పటికే హిందూపురంతో పాటు గోరంట్ల, సోమందేపల్లి, మడకశిర, చిలమత్తూరు. పరిగి, గుడిబండ, అగళి, అమరాపురం ప్రాంతాల నుంచి వచ్చి అడ్వాన్సులు ఇచ్చి వెళ్లారు. వారికి నచ్చిన విధంగా విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నాం.

– పర్బూరామ్, పాలి, రాజస్తాన్

మట్టి వినాయకుడికే ప్రాధాన్యత



ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది వినాయక చవితి. హిందూపురం చెరువు కట్ట కింద 20 అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాన్ని పూర్తి మట్టితోనే సిద్ధం చేయిస్తున్నాం. ఈ ఏడాది చాలా మంది పర్యావరణానికి హాని కలగని విధంగా మట్టి గణపయ్యలనే కొలువుదీర్చేందుకు సిద్ధమయ్యారు. చాలా మంచి పరిణామం.

– వైటీపీ శ్రీనివాసులు, మహాగణపతి ఉత్సవ కమిటీ ప్రతినిధి, హిందూపురం

సమష్టి సహకారం అవసరం



వినాయక చవితిని శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు పోతున్నాం. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇచ్చాం. 18 అడుగులకు మించకుండా విగ్రహాల ఎత్తు ఉంటే మేలు. కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం తరలి రాకుండా నిఘా పటిష్టం చేశాం.

– వి.రత్న, ఎస్పీ

వివాహిత బలవన్మరణం


భర్త విశ్వనాథ్‌తో భువనేశ్వరి(ఫైల్)

ధర్మవరం అర్బన్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలో రాజేంద్రనగర్‌కు చెందిన చింతా లక్ష్మీదేవి, నాగరాజు (లేట్) దంపతుల కుమార్తె భువనేశ్వరి (30)కి గాంధీనగర్‌కు చెందిన గుండా ఓబులేసు, అలివేలమ్మ దంపతుల కుమారుడు విశ్వనాథ్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్ని నెలలు వీరి కాపురం సజావుగా సాగినా... తర్వాత అత్తింటి వేధింపులు తీవ్రమవుతూ వచ్చాయి. ఈ క్రమంలో వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న భువనేశ్వరి సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన భర్త విశ్వనాథ్... విషయాన్ని చేరవేయడంతో మృతురాలి తల్లి, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అత్త అలివేలమ్మ, భర్త విశ్వనాథ్ వేధింపుల వల్లనే తమ కుమార్తె మృతి చెందిందంటూ భువనేశ్వరి తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

‘పోలీసు స్పందన’కు 25 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 25 వినతులు అందాయి. ఎస్పీ వి.రత్న స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అర్జీదారుల్లో అత్యధికంగా మహిళలే ఉండడం గమనార్హం. వినతులు పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సతీష్, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ఎస్సీ కులానికి చెందిన తమపై అగ్ర వర్ణాల వారు దాడులు చేస్తున్నారని, వారి బారి నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి గోరంట్ల మండలం బోయనపల్లికి చెందిన మౌనిష విన్నవించింది. ఓ చిన్నపాటి అంశంలో గొడవ పడిన వారు తరచూ తమ కుటుంబంపై దాడులు చేస్తున్నారని వాపోయింది. ఈ విషయంపై పలుమార్లు గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదంటూ కన్నీటి పర్యంతమైంది. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని వేడుకుంది.

కారు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చెన్నేకొత్తపల్లి: స్థానిక 44వ జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి సమీపంలో 44 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని అనంతపురం వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. చుట్టుపక్కల ధాబా వారిని ఆరా తీస్తే కొన్ని రోజులుగా 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మతి స్థిమితం లేకుండా తిరిగేవాడని తేలింది. ఛామన ఛాయ రంగు, నలుపురంగు టీషర్టు, రంగు వెలసిన ఆకుపచ్చ ప్యాంటు ధరించి ఉన్నాడు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96835, 94407 96836కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి


మృతుడు పెంచలయ్య

పెద్దవడుగూరు: నిల్చొన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సరస్వతిపల్లికి చెందిన పెంచలయ్య (38)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్న పెంచలయ్య... సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వైఎస్సార్ జిల్లా కడప నుంచి బళ్లారికి గ్యాస్ సిలిండర్ల లోడుతో బయలుదేరాడు. తెల్లవారుజామున పెద్దవడుగూరు మండలం వీరేపల్లి వద్ద అప్పటికే బ్రేక్‌డౌన్ కారణంగా రోడ్డుపై నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొనడంతో పెంచలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు వెంటనే క్షతగాత్రుడిని వెలికి తీసి 108 అంబులెన్స్ ద్వారా గుత్తికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సర్పంచ్‌పై టీడీపీ కార్యకర్త దాడి


బాధిత సర్పంచ్ పరంధామ

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామ సర్పంచ్ పరంధామపై టీడీపీ కార్యకర్త రామకృష్ణప్ప దాడి చేశాడు. ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 17న గ్రామంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఆ సమయంలో స్థానిక టీడీపీ నాయకులు ఏకపక్షంగా ఎన్నిక జరపడానికి ప్రయత్నం చేయడంతో పరంధామ అడ్డుకున్నాడు. దీంతో అధికారులు ఓటింగ్ పద్ధతితో ఎన్నికలు పూర్తి చేయడంతో టీడీపీ మద్దతుదారుడు గంగాధర్ ఓటమి పాలయ్యాడు. దీంతో కక్ష పెంచుకున్న టీడీపీ కార్యకర్త రామకృష్ణ సోమవారం ఉదయం మేకలపల్లిలో తారసపడిన పరంధామపై దాడి చేశాడు. టీడీపీ మండల కన్వీనర్ సిద్ధలింగప్ప ప్రోద్బలంతోనే తనపై రామకృష్ణప్ప దాడి చేశాడంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఇదే అంశంపై తనపైనే తప్పుడు ఫిర్యాదు చేసి రౌడీషీట్ తెరవాలని పోలీసులను సిద్ధలింగప్ప ఒత్తిడి చేస్తున్నాడని పరంధామ వాపోయాడు.

లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్య దూడలు

- పశుసంవర్ధక శాఖ డీడీ సుధాకర్


పశువైద్య శిబిరంలో పాల్గొన్న పశువైద్యాధికారులు, రైతులు

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారిత వీర్యంతో కేవలం పెయ్య దూడలే జన్మించేలా చేయవచ్చునని రైతులకు పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ సుధాకర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శుభదాస్ సూచించారు. పుట్టపర్తి మండలం చెర్లోపల్లి గ్రామంలో సోమవారం పశువుల గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ... లింగ నిర్ధారిత వీర్యంతో విదేశీ జాతులే కాకుండా స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పార్కర్ వంటి పెయ్య దూడలు జన్మించేలా చేయవచ్చునన్నారు. అనంతరం పశువుల్లో చూడి నిర్ధారణ, తిరిగి ఎద కట్టకుండా నిలిచిన, పూర్తిగా ఎదకు రాని సుమారు 28 ఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఎద సూది వేసిన 20 రోజుల పాటు బెల్లం నీళ్లు, టెంకాయి నీళ్లు తాగించాలని, 100 గ్రాముల ఎముకల పొడి తినిపించాలని సూచించారు. వీటితో పాటు మునగాకు, కరివేపాకు మేపడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. మేత, దాణాలతో పాటు కొండ చిగరాకు, మొలకెత్తిన పెసులు, ఉలవలు, సద్దలు, రాగులు మేపితే హార్మోన్ లోపం తగ్గి త్వరగా చూలు కడతాయన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీరాములు నాయక్, డాక్టర్ శ్రీహరినాయక్, ఏహెచ్ఏలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సోమవారం 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వానరం మృతి చెందింది. విషయాన్ని గుర్తించిన స్థానికులు నాగరాజు, నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు వానర కళేబరానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు కింద పడి వృద్ధుడికి గాయాలు

కదిరి అర్బన్: మండలంలోని నడింపల్లి వద్ద సోమవారం పట్టాలు దాటుతున్న వృద్ధుడు బహదూర్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అత్యవసర వైద్యం అందని ద్రాక్షే


వైద్య సిబ్బంది లేకపోవడంతో వెనుదిరుగుతున్న గర్భిణి, బంధువులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రం ఎన్‌పీకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్యం అందని ద్రాక్షగా మారింది. పక్కా భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించినా 24 గంటల వైద్య సేవలు మాత్రం అందడం లేదు. సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన మహబూబ్‌బాషా తన కుమార్తెకు సోమవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే ఇక్కడ వైద్యసిబ్బంది ఎవ్వరూ విధుల్లో లేరు. చేసేది లేక ఆశాకార్యకర్తకు ఫోన్ చేయగా.. ఆమె వచ్చి ఆయా సహాయంతో గర్భిణిని పరిశీలించి 108 వాహనానికి సమాచారం అందించి కదిరికి తరలించారు. ఆదివారం సాయంత్రం పలువురు వైద్యసేవల కోసం ఆస్పత్రికి వస్తే సిబ్బంది ఎవ్వరూ లేరని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యసిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టుగూళ్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి

హిందూపురం: పట్టు గూళ్లు తడవకుండా రైతులే జాగ్రత్తలు తీసుకుని మార్కెట్‌కు తరలించాలని హిందూపురం మార్కెట్ అధికారి లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. కొద్దిపాటి వర్షానికే ప్రభుత్వ పట్టు గూళ్ల మార్కెట్ మునిగే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి రాత్రి పూట లాట్‌లు తెచ్చి ఇబ్బంది పడకూడదని, ఉదయమే మార్కెట్‌కు చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

పట్టపగలే రూ.3 లక్షల అపహరణ


ఎర్రిస్వామితో వివరాలు ఆరా తీస్తున్న కానిస్టేబుల్

ఉరవకొండ: స్థానిక ఓ టైలర్ షాపులో ఉంచిన రూ.3 లక్షల నగదును ఓ దుండగుడు అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని సీఎస్ఐ చర్చి ఎదురుగా వంశీ టైలర్స్ పేరుతో ఎర్రిస్వామి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం ఓ ప్లాట్ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంచుకున్న రూ.3 లక్షలను తీసుకుని వచ్చి దుకాణంలో పెట్టి, పనిపై బయటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత దుకాణానికి చేరుకున్న ఎర్రిస్వామి... నగదు ఉంచిన కవర్ కోసం వెదకగా కనిపించక పోవడంతో కుమారుడు రాఘవేంద్రను ప్రశ్నించాడు. అయితే తనకేమీ తెలియదని, ఓ వ్యక్తి వచ్చి దుస్తులు ఆల్ట్రేషన్ చేయాలంటూ తెలిపాడని, అయితే పనిపై బయటకు వెళ్లిన తన తండ్రి వచ్చిన తర్వాత రావాలని తెలపడంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడని వివరించాడు. దీంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు.

ఇంటి దొంగ పనే...

నగదు అపహరణ కేసులో సీఐ సురేష్‌బాబు లోతైన విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఎర్రిస్వామి కుమారుడు రాఘవేంద్ర ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో వాస్తవం బయటపడింది. తనకు కొన్ని అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చే మార్గం కానరాక ఆ డబ్బును తానే తీసి దాచేశానని అంగీకరించాడు. నేరం తనపై రాకుండా ఉండేందుకు ఓ కట్టుకథ అల్లినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు తమ విచారణను కొనసాగిస్తున్నారు.

బొలెరో బోల్తా - కూలీలకు గాయాలు


ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి – కనగానపల్లి మార్గంలో బొలెరో వాహనం బోల్తా పడింది. ఘటనలో ఐదుగురు కూలీలు గాయపడ్డారు. ధర్మవరం మండలం పోతుకుంట బీసీ కాలనీ, గుట్టకిందపల్లి, కుర్లపల్లి తండాలకు చెందిన కూలీలు సోమవారం ఉదయం మామిళ్లపల్లిలో వ్యవసాయ కూలి పనుల కోసం బొలెరో వాహనంలో చేరుకున్నారు. పనులు ముగించుకుని సాయంత్రం అదే వాహనంలో తిరుగు ప్రయాణమైన వారు గ్రామ శివారులోకి చేరుకోగానే స్టీరింగ్ పనిచేయకపోవడంతో మలుపు వద్ద చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ముత్యాలమ్మ, అరుణమ్మను అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు సత్యనారాయణరెడ్డి

శింగనమల/పామిడి: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం కండ్లపల్లికి చెందిన గంధవీటి సత్యనారాయణరెడ్డి(50), తన దాయాది లక్ష్మీకాంత్‌రెడ్డితో కలసి ద్విచక్ర వాహనం మీద సోమవారం అనంతపురానికి వెళ్లాడు. మధ్యాహ్నం పని ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు శింగనమల మండలం లోలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే వర్షం పడుతుండడంతో కాసేపు ఆగారు. అనంతరం 44వ జాతీయ రహదారిపై వెళుతుండగా ద్విచక్ర వాహనం వెనుకనే వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొని, రోడ్డు పక్కన పల్లంలో బోల్తాపడింది. ఘటనలో సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీకాంతరెడ్డిని 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై శింగనమల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కండ్లపల్లిలో విషాదఛాయలు..

సత్యనారాయణరెడ్డి మృతి విషయం తెలియగానే కండ్లపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య ఉష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీకాంతరెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న సత్యనారాయణరెడ్డి మృతిపై ఆ పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు.